క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


కిషన్ (ఫైల్)

దామెర: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఒగ్లాపూర్‌కు చెందిన చిలువేరు కిషన్(50) ఎలక్ట్రికల్ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా ఈనెల 15న సాయంత్రం పరకాలలో వ్యక్తిగత పనులు ముగించుకొని గ్రామానికి తిరిగివస్తున్న క్రమంలో ఒగ్లాపూర్ సమీపంలోకి రాగానే గూడెప్పాడ్ నుంచి హనుమకొండకు వెళుతున్న కారు వేగంగా వచ్చి కిషన్ ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలుకాగా స్థానికులు వెంటనే ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కిషన్ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై అశోక్ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు



వేలేరు : వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు ప్రమాదవశాత్తు జారి పడటంతో కుడికాలు విరిగింది. ఈ సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం .. మండల కేంద్రాని చెందిన బైరి చిన్నవెంకటయ్య రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్నాడు. ఈక్రమంలో కాలు జారీ కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు 108కి సమాచారం అందించగా డాక్టర్ దుర్గా ప్రసాద్ సూచన మేరకు పైలెట్ దయాకర్, టెక్నీషియన్ లింగమూర్తి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

వ్యక్తికి గాయాలు

నడికూడ: మండల కేంద్రంలో నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన నల్ల గేటువాల్వ్‌కు పైకప్పు నిర్మించకపోవడంతో ఓ వ్యక్తికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన చింతలపల్లి భీమ్‌రావు తన బైక్‌పై ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గేటువాల్వ్ హోల్‌లో పడ్డాడు. దీంతో అతడికి గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అయితే గతంలో కూడా ఇదే గేటువాల్వ్ హోల్‌లో పడి పలువురు గాయపడ్డారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి గేటువాల్వ్ హోల్ పైకప్పు నిర్మించాలని కోరుతున్నారు.

నేడు త్రీఫేజ్ సరఫరాకు అంతరాయం

వేలేరు : ధర్మసాగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఎల్కుర్తి 132 కేవీలో సాంకేతిక మరమ్మతులు చేపట్టేందుకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు త్రీఫేజ్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్‌ఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

క్రీడాకారులకు చేయూత

శాయంపేట : మండల కేందంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న సాయిశ్రుతి, లహరి జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక కాగా సర్పంచ్ కందగట్ల రవి చేయూతనిచ్చారు. వారి ప్రయాణ ఖర్చులకు ఒక్కో క్రీడాకారిణికి రూ. 1500 చొప్పున ఆర్థిక సాయం అందించారు. పీఈటీ కరిత, హెచ్ఎం శ్రీలతను స్థానిక ఎస్సై అభినందించారు.

16మందికి వేసెక్టమీ ఆపరేషన్లు

ఐనవోలు: కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స (వేసెక్టమీ) ఆపరేషన్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకూబ్‌పాషా ఆధ్వర్యంలో విజయవంతంగా ముగిసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వేసెక్టమీ ఆపరేషన్ల శిబిరం నిర్వహించగా 16 మందికి శస్త్ర చికిత్స చేసినట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో సీహెచ్ఓలు సునంద, సరస్వతి, పల్లె దవాఖాన డాక్టర్లు నవీన్, సరిత, పర్వీన్, విజయలక్ష్మి, కృష్ణమూర్తి, సతీష్‌చారి, రోజా, భాస్కర్, శ్రీకాంత్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అయ్యప్ప పూజ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన గురుస్వామి ఉప్పునూతల ప్రసాద్ ఇంట్లో గురువారం నారికేళ అయ్యప్ప పూజను గురుస్వామి సామల భిక్షపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి, కుమారస్వామి, లక్ష్మీదేవి, అయ్యప్పస్వామి అష్టోత్తరాలు, శరణుఘోష, వేద మంత్రాల నడుమ పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి, మాజీ సర్పంచ్ చంద్రమౌళి, మాజీ ఎంపీటీసీ శంకరాచారి, గురువాములు ప్రతాప్‌సేనారెడ్డి, రవీందర్, సదానందం, సుమన్, కిషన్, మల్లికార్జున్, శ్రీధర్‌రెడ్డి, ప్రశాంత్, ప్రదీప్, ప్రవీణ్, బాలకృష్ణ, వంశీ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు

- ముందుకు సాగని రోడ్డు నిర్మాణ పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- అవస్థలు ఎదుర్కొంటున్న మూగజీవాలు


ధర్మసాగర్ మండల కేంద్రం నుంచి ఉనికిచర్లకు వెళ్లే రోడ్డుపై తేలిన కంకర

ధర్మసాగర్: మండల కేంద్రం నంచి ఉనికిచర్ల వెళ్లే దారిలో గత సంవత్సరం 4కిలో మీటర్లు నూతన బీటీ రోడ్డుగా పునర్‌నిర్మాణం చేసేందుకు పంచాయతీరాజ్ నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు చేశారు. ఏ ఏడాది మార్చి మాసంలో మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య చేతుల మీదుగా రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. సంబంధిత గుత్తేదారు ఆ రోడ్డులో అక్కడక్కడ పాత బీటీని తొలగించి కంకరపోశాడు. నాలుగు నెలలుగా ఆ రోడ్డును రోలింగ్ చేయకపోవడంతో పాటు బీటీ వేయకుండా వదిలేశారు. రోడ్డుపై పెద్ద కంకర రాళ్లు పైకి తేలడంతో స్థానికులకు కాలినడక కూడా కష్టంగా మారింది. దీంతో ఉనికిచర్ల, హనుమకొండ నుంచి ధర్మసాగర్ వెళ్లే వాహనాలు ఓఆర్ఆర్ జాతీయ రహదారి మీదుగా ధర్మసాగర్ గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే విధంగా ధర్మసాగర్, ఉనికిచర్ల గ్రామాల రైతుల వ్యవసాయ భూములు కూడా ఈ రోడ్డు పక్కనే ఉండడంతో రైతులు, పచ్చిక మేసేందుకు అడవికి వెళ్లే పశువులకు అవస్థలు తప్పడం లేదు. రోడ్డుపై వాహనాలు నడుపుతుంటే అదుపుతప్పి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని, సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికై నా అధికారులు స్పందించి రోడ్డుపై బీటీ వేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

30 ఏళ్ల క్రితం బీటీ రోడ్డుగా..

మండల కేంద్రం నుంచి ఉనికిచర్ల వరకు గతంలో 4కిలోమీటర్లు (ఒక గొలుసు) 33 ఫీట్ల బండ్ల బాట ఉండేది. అయితే ఆ బాట గుండా రోజురోజుకు ప్రయాణికుల రద్దీ పెరగడంతో 30 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చింది. దీంతో వేలేరు, ధర్మసాగర్ తదితర గ్రామాల నుంచి ప్రయాణికులు నిత్యం ఈ రోడ్డు గుండా ఉనికిచర్ల మీదుగా హనుమకొండ, మడిపల్లి, ఎల్కతుర్తి, కరీంనగర్ ప్రాంతాలకు రాకపోకలు సాగించారు. అయితే గత కొంత కాలం క్రితం రోడ్డు మొత్తం గుంతలు పడి పూర్తిగా దెబ్బంది. చినుకు పడితే బురదమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో రోడ్డును పునర్‌నిర్మాణం చేసేందుకు సంవత్సరం క్రితం పంచాయతీ రాజ్ నిధుల నుంచి కోటి రూపాయలతో బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య శంకుస్థాపన చేసి పనులు


గతంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం


కుప్పలుగా పోసిన దస్తు

ప్రారంభించారు. కానీ గుత్తేదారు నిర్లక్ష్యం వలన రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోయాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా వేసిన కంకరతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పనులు ప్రారంభించి వదిలేశారు



6 నెలల క్రితం బీటీ రోడ్డు పనులు ప్రారంభించి పాత బీటీని తొలగించి కంకర పోశారు. అయితే కంకరలో మిక్సింగ్ డస్టు లేకుండా పోయడంతో పెద్ద రాళ్లు తేలాయి. దీంతో వాహనాలు, సైకిళ్లు అదుపు తప్పి కిందపడుతున్నాయి. ఎడ్ల బండ్లపై బావుల వద్దకు వెళ్లాలంటే కంకర్పై ఎడ్లు నడవలేక అవస్థలు పడుతున్నాయి. ఇప్పటికై నా అధికారులు స్పందించి త్వరగా బీటీ వేయాలి.

– బొల్లెద్ల తిరుపతిరెడ్డి, రైతు

రోడ్డుపై నడవలేకపోతున్నాం



రోడ్డుపై కంకర రాళ్లు తేలడంతో ఆ రోడ్డుపై నడవలేకపోతున్నాం. ప్రస్తుతం వరినాట్ల సీజన్ కావడంతో రాత్రిళ్లు కూడా వాహనాలపై బావుల వద్దకు వెళ్లాల్సి వస్తుంది. వాహనాలను నెట్టుకురావడానికి కూడా ఇబ్బంది కరంగా మారింది. పశువుల కాళ్ల డెక్కలకు కూడా రాళ్లు గుచ్చుకొని మూగజీవాలు అవస్థలు పడుతున్నాయి. ఇప్పటికై నా సంబంధిత గుత్తేదారు, అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డుపై బీటీ వేయాలి.

– చల్లా శ్రీనివాస్‌రెడ్డి, రైతు

బాధిత కుటుంబానికి ప్రముఖుల పరామర్శ



కమలాపూర్ : హుజురాబాద్ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్‌గౌడ్, కమలాపూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బాలసాని దేవేందర్ గౌడ్‌ల తల్లి రాజేశ్వరి (రాజవ్వ) (85) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ చలి తీవ్రత అధికమవడంతో అస్వస్థతకు గురై బుధవారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రాజేశ్వరి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదే విధంగా రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి సానుభూతి తెలిపారు.

నేడు ఎమ్మెల్యే సమావేశం

పరకాల: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పరకాల మున్సిపాలిటీ, పరకాల, దామెర, మండల్లాలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమావేశం నిర్వహించనున్నట్లు క్యాంపు ఆఫీసు ఇన్‌చార్జ్ సారంగపాణి తెలిపారు. ఎన్నికల ఫలితాలు, పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలు తదితర అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

స్పోర్ట్స్‌మీట్‌లో ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

శాయంపేట : ఉమ్మడి వరంగల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ స్పోర్ట్స్ మీట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్స్‌లో మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఏ రాహుల్ జావలింగ్ త్రోలో మొదటి బహుమతితో పాటు హైజంప్‌లో రెండో బహుమతి, లాంగ్ జంప్‌లో రెండో బహుమతి సాధించాడు. అలాగే జి.అఖిల్ 60మీటర్ల పరుగు పందెంలో మూడో బహుమతితో పాటు, షాట్‌పుట్‌లో మూడో బహుమతి, లాంగ్‌జంప్‌లో మూడో బహుమతి సాదించాడు. జి.సిద్ధూ హైజంప్‌లో మొదటి బహుమతి, ఎండీ. రఫీక్ ట్రియతలిన్‌లో మూడో బహుమతి, కే.సాయి విగ్నేష్ ట్రియతలిన్‌లో మొదటి బహుమతి, ఆర్.రిశ్విక్ 100మీటర్ల పరుగు పందెంలో రెండో బహుమతి, 600 మీటర్ల పరుగు పందెంలో రెండో బహుమతి, ఎమ్.అనిల్ లాంగ్ జంప్‌లో మొదటి బహుమతి సాధించారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ మోతె రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు క్రీడాకారులు అభినందించారు.

రుణాలు మంజూరు చేయాలి



పరకాల: జిల్లాలో అనేక మంది బీసీ కార్పొరేషన్ రుణాలు కోసం ఎదురు చూస్తున్నారని, కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖను రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కొండా సురేఖకు మంత్రి పదవీ రావడంతో ఆమెను అభినందనలు తెలిపారు. బీసీ కార్పొరేషన్ రుణాల విషయంతో పాటు ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు, బీసీ రిజర్వేషన్లు పెంచేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

పిల్లల భవిష్యత్‌ను ఆగం చేయొద్దు

- సీడీపీఓ భాగ్యలక్ష్మి


మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యలక్ష్మి

శాయంపేట : చదువుకునే వయస్సు పిల్లలకు బాల్య వివాహాలు చేసి వారి బంగారు భవిష్యత్‌ను ఆగం చేయొద్దని సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బేటి బచావో– బేటి పడావో కార్యక్రమంపై ఇన్‌చార్జ్ హెచ్ఎం నాగలత అధ్యక్షతన బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆమె పాల్గొని మాట్లాడారు. బాలురతో సమానంగా బాలికలు కూడా క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏవరైనా బాల్య వివాహాలు జరిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా బాలికల హక్కులను, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంజుల, డీసీపీఓ సంతోష్, కేస్ వర్కర్ విజయ్, ఫైనాన్స్ లిట్రసీ అధికారి లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత దుస్తుల తయారీపై అవగాహన


రాట్నం చుట్టే తీరును పరిశీలిస్తున్న విద్యార్థులు

శాయంపేట : చేనేత దుస్తుల తయారీపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఏకశిలా ప్రైమ్ స్కూల్ ప్రిన్సిపాల్ కొండల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో చేనేత వస్త్రాల తయారీపై గురువారం దామెర మండలంలోని ఏకశిల ప్రైమ్ స్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి సీబీఎస్ఈ స్టేట్ సిలబస్ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో సందర్శించి అవగాహన కల్పించారు. పాఠ్యాంశంలో ఉన్న చేనేత వస్త్ర తయారీ సబ్జెక్టుపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చిట్టెల నుంచి రాట్నం ద్వారా నూలు దారం కండెల పైకి చుట్టడం, మగ్గం ద్వారా వస్త్రాల తయారీ, రంగుల అద్దకం, తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. వస్త్రం తయారీ కోసం ఎంత మంది కార్మికులు పని చేస్తున్నారో వివరించారు. ఉపాధ్యాయులు ప్రవంతి, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



ఐనవోలు: రాష్ట్ర స్థాయి అటల్ టింకరింగ్ సైన్స్ ఎగ్జిబిట్స్ ఫెస్ట్ 2023–24 వరంగల్ పట్టణంలో శుక్రవారం నిర్వహించగా మండలంలోని పున్నేలు క్రాస్ సమీపంలో గల ఏకశిల సీబీఎస్ఈ అండ్ స్టేట్ స్కూల్ విద్యార్థులు సీనియర్ విభాగంలో మొదటి బహుమతి గెలుచుకున్నట్లు ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. ఆటోమేటిక్ చార్జింగ్ ఫర్ ఎలక్ట్రానిక్ వెహికిల్స్ అనే థీమ్‌తో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన 9వ తరగతి విద్యార్థులు సహస్ర, సౌమిత్రి, గైడ్ టీచర్, సైన్స్ హెడ్ బదావత్ రమేష్‌లకు పాఠశాల ఉపాధ్యాయులు గురువారం మొమెంటోలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అడ్మిన్ ఇన్‌చార్జ్ ఎండీ బాబా, వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవి, కిరణ్, గుర్రం రమేష్, ఆర్ కిరణ్ కుమార్ రెడ్డి, అమర్‌నాథ్, నర్సయ్య, నరేష్, అరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ మాధవి

కమలాపూర్ : విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని తహసీల్దార్ మాధవి అన్నారు. భీమదేవరపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కమలాపూర్‌లో మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సభ్యులు, మండల అధికారులకు బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లల నడవడికను గమనించాలని అన్నారు. పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఎస్ఐసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ్ మాట్లాడుతూ.. మండల స్థాయి బాలల పరిరక్షణ కమిటీ బాధ్యతలను వివరించారు. బేటీ బచావో – బేటీ పడావో లో భాగంగా నిర్వహించాల్సిన వివిధ కార్యక్రమాలను వివరించారు. డీహెచ్ఈడబ్ల్యూ కోఆర్డినేటర్ కల్యాణి, సర్పంచ్ రవీందర్, ఎంపీఓ విమల, హెచ్ఈఓ ప్రభాకర్, ఏఎన్ఎం జమున, రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, పద్మకుమారి, మార్గం శ్రీలత పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు

నడికూడ: మండలంలోని అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా దృష్టి సారించాలని తహసీల్దార్ గుండాల నాగరాజు అన్నారు. పోలింగ్ స్టేషన్ల పరిధిలోని బూత్ స్థాయి అధికారులకు మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం శిక్షణ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పుల కోసం అందించిన దరఖాస్తులను వెంటనే కార్యాలయానికి పంపించాలని అన్నారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించి విజయవంతంగా పూర్తి చేసిన బూత్ స్థాయి అధికారులను శాలువలతో సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ హేమ నాయక్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పరకాల: న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైందని, అలాంటి వృత్తిలో ఉన్నత ప్రమాణాలు పాటిస్తూ రాణించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.జనార్ధన్ అన్నారు. తెలంగాణ బార్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను పరకాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ దగ్గరకు ఎంతో నమ్మకంతో వచ్చే కక్షిదారులకు సత్వర న్యాయం చేసేందుకు న్యాయవాదులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.రవీందర్‌బాబు, ఒంటేరు రాజమౌళి, మేరుగు శ్రీనివాస్, లక్కం శంకర్, వెంకటరమణ, కె.సురేష్ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు


ఉత్తరద్వారం ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఐనవోలు: మండలంలోని కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులు ఉత్తరద్వారం నుంచి స్వామి వారిని దర్శించుకోవడానికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీన ఆలయంలో ముక్కోటి ఏకాదశిని విశేషంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వయంభూగా వెలిసిన స్తంభ నారాసింహుడితో పాటు గర్భాలయంలో ప్రతిష్ఠించిన లక్ష్మీనరసింహ ధ్రువ మూర్తిని దర్శించుకోవచ్చని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

నేల పునరుత్పాదక పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న సర్పంచ్ రాజిరెడ్డి

శాయంపేట : రైతులు సాగు చేసే పంటల్లో అధిక దిగుబడులు పొందాలంటే నేల పునరుత్పాదక పద్ధతులు పాటించాలని సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి అన్నారు. మండలంలోని పత్తిపాక గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజ్వల్ రైతు ఉత్పత్తిరుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగు మందులు అధికంగా వినియోగించడం వలన నేల నిస్సారత స్థితిగా మారిపోవడంతో దిగుబడి రావడం లేదని అన్నారు. ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం నుంచి రైతులకు వరంగల్ గోల్డ్‌ను అందించడం జరుగుతుందని, ఇది రైతులు ఎకరానికి 6 క్వింటాళ్ల చొప్పున వేసుకోవడం వలన భూమిలో సేంద్రీయ కర్బనం పెరిగి దిగుబడి పొందవచ్చని అన్నారు. ప్రజ్వల్ ఉత్పత్తిదారుల సంఘం క్షేత్ర సిబ్బంది భానుమతి, ఎంపీటీసీ ఐలయ్య, ఆ సంఘం పాలకవర్గ సభ్యులు రజిత పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఐనవోలు: మండలంలోని పంథిని గ్రామానికి చెందిన బండి అనిల్ ఇటీవల మృతి చెందగా మాజీ సర్పంచ్ బరిగల సదానందం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో కంకర శ్రీను, శేషి, సమ్మయ్య, కుమారస్వామి, కనకమల్లు, సాయిలు, సదానందం, కొమ్మాలు, సూరయ్య, రాజు, సంతోష్, కుమారస్వామి, సురేష్, సారయ్య, భిక్షపతి, ఉప్పలయ్య ఉన్నారు.

రామానుజన్‌కు ఘన నివాళి



దామెర: నేడు గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని మండలంలోని డిస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థులు రామానుజన్ నంబర్ (1729) ఆకృతిలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా రామానుజన్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘన నివాళి అర్పించారు.

భగీరథ నీరు వృథా



దామెర: గేట్‌వాల్వ్ లీకేజీతో మిషన్ భగీరథ నీరు వృథాగా పోతున్నాయి. మండలంలోని సీతారాంపూర్ గ్రామం నుండి ఆత్మకూరు అగ్రంపహాడ్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న కల్వర్టు సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ గేట్‌వాల్వ్ లీకేజీ అయ్యింది. దీంతో నీరు వృథాగా పోతున్నాయి. స్థానికులు సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి సమాచారం అందించినప్పటికీ సాయంత్రం వరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సమీప పొల్లాలు నీటితో నిండిపోయాయి. అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నారు.